సాక్షి
విజయనగరం
సోమవారం | 4 | మార్చి | 2024



బంగారు భవితకు సోపానం
గ్రామీణ ప్రాంతాల్లో గల ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆంగ్లభాషలో విద్యను ఉచితంగా అందించేందుకు మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ఆనాడే సంకల్పించారు. - 8లో



పరీక్షలకు సిద్ధం కావాలి
పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ సూచించారు. - 8లో



నేటి నుంచి సహాయ నిరాకరణ
పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పీఏసీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు పి.కామేశ్వరరావు డిమాండ్ చేశారు. - 8లో

నాడు అరచేతిలో వైకుంఠం!

నేడు అభివృద్ధి సాకారం

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రగతి పథం
- పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీ కార్యరూపం
- విద్య, వైద్యం, సాగునీరు, ఉపాధి లక్ష్యంగా బృహత్తర కార్యాచరణ
- 'సాక్షి' ఇంటర్వ్యూలో వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు



సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

రాష్ట్ర విభజన తర్వాత ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి అధికార పీఠం ఎక్కిన చంద్రబాబు ఈ ప్రాంతాభివృద్ధికి చేసిందేమీ లేదు. ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకునేందుకు నాటి ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజాసంకల్ప యాత్ర రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయి. దుర్భర పరిస్థితుల్లో ఉన్న ఉమ్మడి విజయనగరం జిల్లా దశా దిశా మార్చేసిన చారిత్రక ఘట్టం కూడా. 'తమ కష్టాలను మొరపెట్టుకుంటూ నాడు తనను కలిసిన ప్రజలకు భరోసా ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... వాటిని నెరవేర్చేందుకు అధికారం చేపట్టిన క్షణం నుంచి గత 58 నెలలుగా అహర్నిశలు శ్రమిస్తూనే ఉన్నారు. విద్య, వైద్యం, సాగునీరు, ఉపాధి కల్పనే లక్ష్యంగా బృహత్తర ప్రణాళికతో చేపట్టిన ప్రాజెక్టులన్నీ సాకారమవుతున్నాయ'ని వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక ఏ విధంగా నెరవేర్చిందీ 'సాక్షి ' ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే....

'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షనేతగా చేపట్టిన తన ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా 2018 సెప్టెంబరు 18వ తేదీన కొత్తవలస మండలంలోని చింతలపాలెం వద్ద ఉమ్మడి విజయనగరం జిల్లాలోకి అడుగుపెట్టారు. ప్రతి నియోజకవర్గంలోనూ ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టిన వైనం ఇప్పటికీ కళ్ల ముందు కదులుతుంటుంది. వారి సమస్యలను సావధానంగా విన్నారు. వాటి పరిష్కారానికి ముఖ్యమంత్రిగా తగిన చర్యలు చేపట్టారు.

శృంగవరపుకోట నియోజకవర్గంలో...

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి: నిర్మించిన నాటి నుంచి ఏనాడూ చూడని విధంగా చంద్రబాబు పాలనలో తాటిపూడి రిజర్వాయరు ఎండిపోయిందని, సాగునీరు అందించడానికి ఆయన ఏమీ చేయలేదని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పడకేసిందని రైతులు కొత్తవలస వద్ద జగన్‌మోహన్‌రెడ్డికి మొరపెట్టుకున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుపై దృష్టి పెట్టారు. జిల్లాలో 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగానున్న ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులు మంజూరు చేశారు. భూసేకరణ ప్రక్రియ సాగుతోంది.

ఎంఎస్‌ఎంఈ పార్కు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఇచ్చిన అనుమతులతో ఎస్.కోట సమీపంలో అల్యూమినియం ఫ్యాక్టరీ ఏర్పాటుకు భూసేకరణ జరిగింది. ఆ తర్వాత ఫ్యాక్టరీ నిర్మాణం అటకెక్కేసినా చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. ఈ నేపథ్యంలో తమకు ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకోవాలన్న యువకుల వినతి మేరకు ఆ ప్రదేశంలో ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దాదాపు రూ.550 కోట్ల పెట్టుబడితో ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో దాదాపు వెయ్యి ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఈపార్కులో అనేక చిన్న,మధ్య తరహా పరిశ్రమలు వస్తాయి. 45వేల మందికి ఉపాధి కలుగుతుంది.

విజయనగరం నియోజకవర్గంలో..

ప్రభుత్వ మెడికల్ కాలేజీ: అత్యవసర పరిస్థితుల్లో సూపర్ స్పెషాలిటీ వైద్యం కోసం వ్యయప్రయాసలకోర్చి ఇక్కడి ప్రజలు విశాఖపట్నం వరకూ వెళ్లాల్సి వచ్చేది. జిల్లా కేంద్రమైన విజయనగరంలో మెడికల్ కాలేజీ పెట్టిస్తామని నాడు టీడీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో విలువైన మాన్సాస్ భూములు చౌకగా విక్రయించేశారు. తర్వాత చేతులెత్తేశారు. ప్రజల కష్టాలు చూసిన జగన్‌మోహన్‌రెడ్డి పైడితల్లి అమ్మవారి సాక్షిగా హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.500 కోట్లతో తలపెట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీకి తానే శంకుస్థాపన చేశారు. శరవేగంతో నిర్మాణ పనులు పూర్తి చేయించిన ఆయనే ప్రారంభించడం విశేషం.

జేఎన్‌టీయూ–జీవీ: విజయనగరం జిల్లా కేంద్రానికి జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ) ఇంజినీరింగ్ కళాశాలను తీసుకొచ్చింది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి. తన పాదయాత్రలో జిల్లాకు వచ్చినప్పుడు ఇక్కడ విద్యాపరంగా వెనుకబాటుతనాన్ని గుర్తించిన ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత 2007 సంవత్సరంలో దీన్ని ఏర్పాటు చేశారు. తమ ప్రాంతానికి యూనివర్సిటీ కావాలన్న ప్రజల విన్నపాన్ని ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో విన్నారు. దీంతో 2019 సార్వత్రిక ఎన్నికలకు కొద్ది రోజుల ముందు నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదరాబాదరాగా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఒక జీవో ఇచ్చేసి ఊరుకున్నారు. జేఎన్‌టీయూ–కాకినాడకు అనుబంధంగా కొనసాగిన ఈ ఇంజినీరింగ్ కళాశాలను పూర్తి స్థాయిలో జేఎన్‌టీయూ–గురజాడ విజయనగరం (జేఎన్‌టీయూ–జీవీ)గా పేరుమార్చి యూనివర్సిటీ చేసింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే.

నెల్లిమర్ల నియోజకవర్గంలో..

తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టు: విజయనగరం పట్టణ ప్రజల తాగునీటి సమస్యకు, నెల్లిమర్ల నియోజకవర్గంలో సాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం ఏమిటని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఇక్కడికొచ్చినప్పుడు ఆలోచించారు. ముఖ్యమంత్రిగా రాబోయే 30 సంవత్సరాలకు సరిపోయేలా తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టు మిగులు పనులు పూర్తి చేయడానికి సుమారు రూ.200 కోట్లు మంజూరు చేశారు.

భోగాపురం విమానాశ్రయం: 2019 సార్వత్రిక ఎన్నికలకు కేవలం రెండు నెలల ముందు నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదరాబాదరాగా వచ్చి శిలాఫలకం వేసి వెళ్లిపోయారు. పాదయాత్రలో భాగంగా వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డికి బాధితులంతా మొర పెట్టుకున్నారు. తగిన పరిహారం ఇవ్వకుండా బలవంతంగా భూసేకరణ చేస్తున్నారని రైతులంతా వాపోయారు. వారికి ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి అయిన తర్వాత పరిహారాన్ని రెట్టింపు చేశారు. వారిపై టీడీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులన్నీ రద్దు చేయించారు. నిర్వాసితులకు దాదాపు రూ.80 కోట్లతో టౌన్‌షిప్‌ను తలదన్నే సౌకర్యాలతో కాలనీలను నిర్మించారు. అన్ని సమస్యలను పరిష్కరించిన తర్వాత గత ఏడాది భూమి పూజ చేశారు. ప్రస్తుతం సుమారు రూ.4,500 కోట్లతో నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

చింతపల్లి ఫ్లోటింగ్ జెట్టీ: జీవనోపాధి కోసం వలస పోతున్న మత్స్యకారుల వేదనను చూసిన జగన్‌మోహన్‌రెడ్డి... చింతపల్లి తీరంలో రూ.25 కోట్లతో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

చీపురుపల్లి నియోజకవర్గంలో...

ఆసుపత్రి నిర్మాణం: చీపురుపల్లిలో ఉన్న 50 పడకల ఆస్పత్రిని వంద పడకల సామర్థ్యానికి పెంచాలని స్థానికులు జగన్‌మోహన్‌రెడ్డికి పాదయాత్రలో విన్నవించారు. నాడు వారికిచ్చిన హామీ మేరకు వంద పడకల స్థాయికి విస్తరించారు. పూర్తి స్థాయిలో వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించారు.

గజపతినగరం నియోజకవర్గం...

తోటపల్లి బ్రాంచ్ కెనాల్: తమ పొలాలకు తోటపల్లి ప్రాజెక్టు నుంచి నీరు ఇవ్వాలన్న ఆ ప్రాంత ప్రజల విన్నపం మేరకు జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ప్రాజెక్టు మిగులు పనులను పూర్తి చేయడానికి రూ.200 కోట్లు మంజూరు చేశారు.

బొబ్బిలి నియోజకవర్గం...

చెరకు రైతుల బకాయిలు: చంద్రబాబు పాలనలో అస్తవ్యస్త విధానాల వల్ల ప్రైవేట్‌పరమవ్వడమే గాక తమకు బకాయిలు చెల్లించలేదని చెరకు రైతులు జగన్‌మోహన్‌రెడ్డికి పాదయాత్రలో విన్నవించారు. ఎన్ని పోరాటాలు చేసినా గత పాలకులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఇచ్చిన హామీ మేరకు జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఫ్యాక్టరీకి సంబంధించిన భూములను వేలం వేసి సుమారు రూ.35 కోట్ల మేర రైతులకు బకాయిలను చెల్లించారు.

సాలూరు నియోజకవర్గం...

గిరిజన విశ్వవిద్యాలయం: తమ కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఇస్తే... చంద్రబాబు ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారుల మేలు కోసం దాన్ని కొత్తవలస ప్రాంతంలో పెడుతున్నారని గిరిజనులు జగన్‌మోహన్‌రెడ్డి వద్ద ఆవేదన చెందారు. వారికి ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ యూనివర్సిటీని సాలూరు నియోజకవర్గం పరిధిలోకి తెచ్చారు.

పార్వతీపురం నియోజకవర్గం....

ప్రత్యేక జిల్లా: తమకు ప్రత్యేకంగా జిల్లా ఏర్పాటు చేయాలని పార్వతీపురం పరిసర ప్రాంత ప్రజలంతా పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. వారికిచ్చిన హామీ మేరకు పార్వతీపురం మన్యం జిల్లాను ఏర్పాటు చేశారు.

సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి: తీవ్ర ఆరోగ్య సమస్య వస్తే విజయనగరమో, విశాఖపట్నమో పోవాల్సి వస్తోందన్న గిరిజనుల ఆవేదనను జగన్‌మోహన్‌రెడ్డి విన్నారు. అందుకే పార్వతీపురంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. తాజాగా ప్రభుత్వ మెడికల్ కాలేజీని మంజూరు చేశారు.

కురుపాం నియోజకవర్గం...

గిరిజన ఇంజినీరింగ్ కాలేజీ: గిరిజనుల పిల్లలకు ఉన్నత సాంకేతిక విద్యను అందుబాటులోకి తేవాలన్న విన్నపం మేరకు జగన్‌మోహన్‌రెడ్డి... కురుపాంలో రూ.125 కోట్లతో గిరిజన ఇంజినీరింగ్ కాలేజీని మంజూరు చేశారు. త్వరలోనే అక్కడ తరగతులు ప్రారంభమవుతాయి.

మళ్లీ ఫ్యాన్‌దే హవా...

మ్యానిఫెస్టోలోని హామీలే గాక ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇతోధికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. ప్రజల జీవన ప్రమాణాలను మార్చారు. నవరత్నాల పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేర్చారు. ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ ఫ్యాన్‌దే హవా. ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, తమ్మినేని సీతారాం, కోలగట్ల వీరభద్రస్వామి తదితర పెద్దల సూచనలు, ఎమ్మెల్యేల సమన్వయంతో 19 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా సమష్టిగా పని చేస్తాం. కీలకమైన బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేతకు కృతజ్ఞతలు.
– మజ్జి శ్రీనివాసరావు,
వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్



పాదయాత్రలో భాగంగా జిల్లాలో అడుగుపెట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

న్యూస్‌రీల్

వెబ్‌సైట్‌లో టెన్త్ పరీక్షల హాల్‌టిక్కెట్‌లు

విజయనగరం అర్బన్: ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థుల హాల్ టిక్కెట్‌లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని డీఈఓ ఎన్.ప్రేమ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టిక్కెట్ కోసం ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం 12 గంటల తర్వాత 'బీఎస్‌ఈ.ఏపీ.జీఓవి.ఐఎన్' వెబ్‌సైట్ నుంచి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాల లాగిన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు తమ యూజర్ ఐడీ, స్కూల్‌కోడ్, పాస్‌వర్డ్‌ల ద్వారా తీసుకోవాలని తెలిపారు. వ్యక్తిగతంగా విద్యార్థులు కూడా స్ట్రీమ్, జిల్లా, పాఠశాల పేరు, విద్యార్థి పేరు, పుట్టిన తేదీ మొదలైన ఫీల్డ్‌లను ఎంచుకోవడం ద్వారా తమ హాల్ టికెట్స్‌ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల లాగిన్‌లో హాల్ టికెట్స్‌ను డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేయాలని ఆదేశించారు.

'ఆరోగ్యశ్రీ'తో కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సలు



మాట్లాడుతున్న డాక్టర్ అజయ్‌కుమార్

విజయనగరం ఫోర్ట్: పుట్టుకతో మూగ, చెవిటి సమస్య ఉన్న వారికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సలు ప్రభుత్వం ఉచితంగా చేయిస్తోందని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఈఎన్‌టీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బర్ల అజయ్ కుమార్ పేర్కొన్నారు. వరల్డ్ హియరింగ్ డే సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలకు రూ.లక్షల్లో ఖర్చు అయినప్పటికీ ప్రభుత్వమే భరిస్తోందని చెప్పారు. చెవిటి, మూగ ఉన్న పిల్లల తల్లిదండ్రులు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు చూపించి శస్త్రచికిత్సలు చేయించుకోవాలని సూచించారు.

5వ బెటాలియన్ కమాండెంట్‌గా గౌతమీశాలీ



గౌతమీశాలీ

విజయనగరం క్రైమ్: ఏపీఎస్పీ 5వ బెటాలియన్ కమాండెంట్‌గా గౌతమీశాలీనిని బదిలీ చేస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. 16వ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేస్తున్న ఈమెను 5వ బెటాలియన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకూ 5వ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేస్తున్న అధిరాజ్ సింగ్ రానాను విజయవాడ డీసీపీగా బదిలీ చేశారు.

సైన్స్‌తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

- విజ్ఞాన యాత్ర బస్సును ప్రారంభించిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



విజ్ఞాన యాత్ర బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: విద్యార్థులు భవిష్యత్ సైన్స్‌తోనే ముడిపడి ఉందని అందుకనే ప్రభుత్వం విద్యార్థుల విజ్ఞాన యాత్రలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లాలోని కుప్పంలో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆవరణలో ఉన్న సైన్స్ ల్యాబ్‌లు తిలకించేందుకు జిల్లాలోని 16 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 40 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వారంతా ఆదివారం చిత్తూరుకు బస్సులో బయిలుదేరారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఆ బస్సును జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞాన యాత్రకు తీసుకువెళ్తున్న విద్యార్థుల ఎంపికపై డీఈఓ ప్రేమ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. డీఈఓ మాట్లాడుతూ గతంలో జిల్లాలో నిర్వహించిన సైన్స్ ఫేర్‌లో ప్రథమ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ఎంపిక చేసామని చెప్పారు. విద్యార్థులు ఇంటికి వచ్చేంత వరకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా విజ్ఞాన యాత్రకు వెళ్తున్న 40 మంది విద్యార్థుల భోజన, వసతి నిమిత్తం జెడ్పీ చైర్మన్ రూ.50వేలు అందజేశారు. అవసరమైతే మరింత సాయం చేస్తానని ఆయన ప్రకటించారు. జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ మిరియాల కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, సువ్వాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలతో నిండు జీవితం

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు



కంటోన్మెంట్ పార్కులో చిన్నారికి పల్స్‌పోలియో చుక్కలు వేస్తున్న డీఎంహెచ్‌ఓ

విజయనగరం ఫోర్ట్: నిండు జీవితానికి పోలియో చుక్కలు రక్షణ ఇస్తాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగరంలోని కంటోన్మెంట్ పార్క్‌లో ఆదివారం ఆయన పిల్లలకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలు అందరికీ పోలియో చుక్కలు వేయించాలని చెప్పారు. జిల్లాలో 0 – 5 ఏళ్లు వయసున్న పిల్లలు సుమారు లక్షా 98 వేల మంది ఉన్నారని, వీరందరికి పోలియో చుక్కలు వేయడానికి 1184 పోలియో బూత్‌లను ఏర్పాటు చేసామని చెప్పారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వద్ద కూడా పోలియో బూత్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, ఎంహెచ్‌ఓ సాంబమూర్తి, డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

1,94,111 మందికి పోలియో చుక్కలు

విజయనగరం ఫోర్ట్: పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో 97.80 శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వైద్య సిబ్బంది వేశారు. జిల్లాలో 0–5 ఏళ్లలోపు పిల్లలు 1,98,478 మందికి పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 1,94,111 మందికి పోలియో చుక్కలు వేశారు. 1170 పోలింగ్ బూతుల ద్వారా పిల్లలకు చుక్కల మందు వేశారు. మిగిలిన పిల్లలకు 4,5 తేదీల్లో ఇంటింటికి వెళ్లి వేస్తామని డీఎంహెచ్‌ఓ భాస్కరరావు తెలిపారు.

జాతీయ స్థాయిలో 'ఇనపకుర్తి' చిత్రాల ఎంపిక



జాతీయ స్థాయిలో విజేతగా ఎంపికైన చినసత్యనారాయణ ప్రదర్శనలు

పూసపాటిరేగ : పూసపాటిరేగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయుడు ఇనపకుర్తి చినసత్యనారాయణ వేసిన చిత్ర కళా వస్తువులకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ నెల 2న గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలో కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఆర్ట్స్ ఎగ్జిబిషన్, కేఎల్ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన పోటీలలో ఈయన చిత్రాలు విజేతగా నిలిచాయి. ఈ ప్రదర్శనలో దేశం నలుమూలలు నుంచి 200 మంది యువ జాతీయ, అంతర్జాతీయ స్థాయి చిత్రకారులు తమ చిత్రాలను ప్రదర్శించారు. ఇందులో చిన సత్యనారాయణ వేసిన బుడబుక్కలవాడు, ద్వారం వెంకటస్వామినాయుడు (సింబాలిజం), సుద్దముక్కపై గంటస్తంభం, గురజాడ అప్పారావు, వరల్డ్ కప్, శివలింగం తదితర శిల్పాలు ప్రదర్శించారు. నఖ చిత్రాల లో వినాయకుడు, హంస, నెమలి, పక్షి మొదలగు వాటిని ప్రదర్శించారు.

కష్ట కాలంలో.. అన్నదాతకు అండగా...

రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాలన సాగిస్తోంది. సాగు పెట్టుబడి సాయం నుంచి దిగుబడులు కొనుగోలు వరకు రైతులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా అన్నీ తానై సహకరిస్తోంది. అదే సమయంలో ప్రకృతి వైపరీత్యాల సమయంలో జరిగే నష్టాలకు రోజుల్లోనే పరిహారం అందజేసి అండగా నిలుస్తోంది.

- పంట నష్టం జరిగిన వెంటనే పరిహారం చెల్లింపు
- 2019 నుంచి ఇప్పటి వరకు రూ.4.92 కోట్ల చెల్లింపు
- 14,290 మందికి లబ్ధి



నీట మునిగిన వరి పంట (ఫైల్)

విజయనగరం ఫోర్ట్:

రైతు సంక్షేమానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టింది. సాగు పెట్టుబడికి రైతు భరోసా పథకం ద్వారా ఆర్థిక సాయం చేస్తూ విత్తనాల నుంచి ఎరువుల దాకా రైతుకు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. గ్రామ సచివాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నారు. ప్రభుత్వ పరంగా అవసరమైన సాయం చేయడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాలు సంభవించేటప్పుడు పంట దెబ్బతిన్న సమయంలో కూడా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. పంట నష్టం జరిగిన వెంటనే రైతులకు పరిహారం అందించి వారికి భరోసా కల్పించింది. 2019 నుంచి ఇప్పటివరకు సంభవించిన ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్ట పోయిన వేలాది మంది రైతులకు ప్రభుత్వం కోట్లాది రుపాయిల పరిహారం అందించింది.

టీడీపీ హయాంలో ఇలా...

తెలుగుదేశం పార్టీ హయాంలో ప్రకృతి వైపరీత్యాలు (అతివృష్టి, అనావృష్టి) సంభవించేటప్పుడు పంట నష్టం జరిగిన ఏడాది, ఏడాదిన్నరకుగాని రైతులకు అప్పటి చంద్రబాబు ప్రభుత్వం పరిహారం చెల్లించేది కాదు. రైతులకు ఇచ్చే పరిహారాన్ని కూడా బినామీ పేర్లతో టీడీపీ నేతలు బొక్కేసేవారు. పంట నష్టం జరగని వారు, భూమిలేని వారు సైతం పంట నష్టం జరిగినట్టు రాయించుకుని పరిహారం తీసేసేవారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారం చేపట్టాక పంట నష్టం జరిగిన నెలలోపే రైతులకు పరిహారం అందించింది. పంట నష్టం అంచనాను అత్యంత పారదర్శకంగా నిర్వహించారు. అంతేకాకుండా ఈ–క్రాప్ నమోదు ఆధారంగా పంట నష్టం అంచనా వేయడం వల్ల బినామీలకు ఆస్కారం లేకుండా పోయింది. పంట నష్టం జరిగిన పంట ఫొటోతో పాటు, రైతు ఫొటోను అప్‌లోడ్ చేయడం వల్ల అవినీతికి తావు లేకుండా పంట నష్ట పరిహారం అందే పరిస్థితులు నెలకొన్నాయి.

రూ.4.92 కోట్ల పరిహారం అందజేత

2019 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం కోట్లాది రుపాయిల పరిహారాన్ని రైతులకు అందించింది. గడిచిన ఐదేళ్లలో పంట నష్ట పరిహారం కింద 14,290 మంది రైతులకు సంబంధించి 3632.40 హెక్టార్లలో పంట నష్టం సంభవించగా రూ.4.92 కోట్లు ప్రభుత్వం అందజేసింది. పంట నష్టం సంభవించిన రోజుల్లో నే ఈ మొత్తాన్ని అందజేయడంతో అన్నదాత కష్టకాలంలో ప్రభుత్వం అండగా నిలిచినట్టయింది.

పరిహారం బ్యాంకు ఖాతాలో జమ



పంట నష్టం జరిగిందని రైతులు తెలిపిన వెంటనే విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, వీఆర్‌ఓ సంయుక్తంగా పంట నష్టం అంచనా వేసి ప్రతిపాదనలు పంపిస్తారు. వాటిని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. పంట నష్టం జరిగిన వెంటనే ప్రభుత్వం వారి ఖాతాల్లో పరిహారాన్ని జమ చేస్తోంది.
– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

నెల రోజుల్లోపే...



2021లో పంట కోత కోసే సమయంలో నీట మునిగింది. ఈ విషయాన్ని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు చెప్పాను. అతను నీట మునిగిన పంటకు, నాకు ఫొటో తీసి పంపించారు. పంట నష్టం జరిగిన నెల రోజుల్లోపు నా బ్యాంకు ఖాతాలో రూ.6 వేలు ప్రభుత్వం పంట నష్ట పరిహారం వేసింది. ఇంతకంటే ఏం కావాలి.
– సిరపురపు గోవింద, రైతు పెదవేమలి

ఐదేళ్లలో పంట నష్ట పరిహారం చెల్లింపులు ఇలా...

సంవత్సరం	నష్టపోయిన రైతులు	పంట దెబ్బతిన్న విస్తీర్ణం	చెల్లించిన మొత్తం
2019 – 20	828	216.10 హెక్టార్లు	రూ.31.80 లక్షలు
2020 – 21	6882	1707.19 హెక్టార్లు	రూ.2.26 కోట్లు
2021 – 22	4880	1291.41 హెక్టార్లు	రూ.1.81 కోట్లు
2022 – 23	105	21.03 హెక్టార్లు	రూ.3.09 లక్షలు
2023 – 24	1595	395.75 హెక్టార్లు	రూ.49.47 లక్షలు

క్లుప్తంగా

ట్రావెల్స్ బస్సు బోల్తా: ఐదుగురికి గాయాలు




పొలంలోకి వెళ్లిపోయిన బస్సు,(ఇన్‌సెట్లో) చికిత్స పొందుతున్న ప్రయాణికురాలు

గరుగుబిల్లి: పార్వతీపురం నుంచి కాశీ పుణ్యక్షేత్రం సందర్శనకు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి పొలంలోకి వెళ్లిపోయింది. దీంతో ఐదుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ప్రమాదంపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం వేకువజామున 3 గంటల సమయంలో పార్వతీపురం నుంచి కాశీ తీర్థయాత్రకు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో 22 మంది యాత్రికులు బయల్దేరారు. వారంతా తొలుత శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలోని శ్రీసూర్యనారాయణస్వామి పుణ్యక్షేత్రాన్ని దర్శించుకునేందుకు వెళ్తున్నారు. ప్రయాణం ప్రారంభమైన కొద్ది సేపటికే గరుగుబిల్లి మండలంలోని చిలకాం మలుపువద్ద ఎదురుగావస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బస్సు అదుపు తప్పి బస్సు షెల్టర్‌ను ఢీకొని పంటపొలంలోకి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఐదుగురు యాత్రికులకు స్వల్పగాయాలయ్యాయి. గాయాలపాలైన వారిని పార్వతీపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స అందజేశారు.

ఘనసరలో ఏనుగుల సంచారం



జొన్న పంటను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని ఘనసర చుట్టు పక్కల ఏనుగుల గుంపు ఆదివారం సంచరించింది. ఈ సందర్భంగా పచ్చని పంటలను పాడుచేస్తూ తినివేశాయి. రోడ్ల మీదకు వచ్చిన ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేశాయి. పాత ఘనసర, కీసర, కోసలి మధ్య రోడ్డుపై నాలుగు ఏనుగుల గుంపు రెండుగా విడిపడి రోడ్ల వెంబడి తిరుగాడడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. వాటిని గమనించిన గ్రామస్తులు పరుగుపెట్టారు. పంట పొలాలకు వెళ్లిన రైతులు భయంతో ఇంటి ముఖం పట్టారు.

20 మద్యం బాటిల్స్‌తో వ్యక్తి అరెస్ట్

వంగర: మండల పరిధి సంగాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుబడినట్లు ఎస్సై వై.వీ జనార్దన్ తెలిపారు. శనివారం రాత్రి గ్రామానికి మద్యం తరలిస్తున్న సమాచారం తెలుసుకుని ఆ వ్యక్తి నుంచి 20 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్సై చెప్పారు.

తోటల్లో అగ్నిప్రమాదం

బలిజిపేట: మండలంలోని మిర్తివలస తోటల్లో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి సుమారు 15ఎకరాలకు నష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన బి.కృష్ణ, వి.త్రినాథరావు, సత్యంనాయుడు, జి.రామారావు, వి.సన్యాసినాయుడు, చిన అప్పలనాయుడు, వి.చిన్నికృష్ణ తదితర రైతులకు చెందిన జీడి, మామిడి, టేకు తదితర మొక్కలు, చెట్లు నష్టపోయినట్లు గ్రామస్తులు చెప్పారు. రెవెన్యూ అధికారులు వచ్చి పరిస్థితిని గమనించారన్నారు.

చెట్టుకూలి వ్యక్తి మృతి



చెట్టుకూలిన ప్రమాదంలో మృతిచెందిన శ్రీనివాసరావు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి జంక్షన్ సమీపంలో ఆదివారం సాయంత్రం భారీ వృక్షం నేలకూలడంతో ఓ వ్యక్తి గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మున్సిపాల్టీ పరిధి కొండంపేట గ్రామానికి చెందిన ముద్దన శ్రీనివాసరావు (44) బొబ్బిలి జంక్షన్ మీదుగా చీపురుపల్లి రోడ్డువైపు వెళ్తున్నాడు. చీపురుపల్లి ప్రధాన రహదారి పక్కన ఎర్రచెరువు గట్టును ఆనుకుని ఉన్న వృక్షం ఒక్కసారిగా రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది. ఆ సమయంలో అటుగా వెళ్తున్న శ్రీనివాసరావుకు చెట్టు కొమ్మలు తగలడంతో తీవ్రంగా గాయాల పాలయ్యాడు. వెంటనే స్థానికులు రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం కేర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి తల్లి సరోజినితోపాటు భార్య ఉమ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందితే కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తామని సీఐ డి.మోహనరావు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260

ఆదర్శపాఠశాలలో ప్రవేశం..

బంగారు భవితకు సోపానం

- నేటి నుంచి నెలాఖరు వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష
- ఒక్కో పాఠశాలలో అదనంగా 20 సీట్లు పెంపు

కొత్తవలస: గ్రామీణ ప్రాంతాల్లో గల ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆంగ్లభాషలో విద్యను ఉచితంగా అందించేందుకు మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖర రెడ్డి ఆనాడే సంకల్పించారు. ఈ మేరకు 2013వ సంవత్సరంలో ఆదర్శపాఠశాలలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా 16 పాఠశాలలను స్థాపించారు. ఈ పాఠశాలల్లో ప్రతి సంవత్సరం 1600 మంది విద్యార్థులకు 6వ తరగతిలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. గతంలో అరవ తరగతిలో ఒక్కో పాఠశాలలోను 80 మంది విద్యార్థులకు మాత్రమే ప్రవేశాలను కల్పించేవారు. ప్రస్తుతం వంద సీట్లకు పెంచినట్లు అధికారులు తెలిపారు. ప్రవేశ పరీక్షలో కనబర్చిన ప్రతిభ ఆధారంగా ప్రవేశాలను కల్పిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆరవతరగతిలో ప్రవేశించిన విద్యార్థులకు ఇంటర్మీడియట్ వరకు ఎటువంటి ఫీజు లేకుండా ఉచితంగా ఆంగ్లమాధ్యమంలో బోధిస్తారు. కంప్యూటర్ ల్యాబ్స్, సైన్స్ ల్యాబ్స్, డిజిటల్ క్లాస్‌రూమ్స్, అత్యుత్తమ గ్రంథాలయాలు, మరెన్నో సౌకర్యాలతో కూడిన ప్రత్యేక శిక్షణతో విద్యాబోధన అందజేస్తున్నారు.

దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్హత

2024–25 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదివిన వారై ఉండాలి. ఓసీ, బీసీలకు చెందిన వారు 1.9.2012 నుంచి 31.8.2014 మధ్య జన్మించి ఉండాలి. అలాగే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే 1.9.2010 నుంచి 31.8.2014 మధ్య జన్మించిన వారు అర్హులు.



కొత్తవలస ఆదర్శ పాఠశాల ముఖ చిత్రం

దరఖాస్తు చేసుకునే విధానం

విద్యార్థులు ఏపీ ఆన్‌లైన్ లేదా మీసేవాకేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.75 ఫీజు చెల్లించాలి. దరఖాస్తుతో పాటు ఆధార్, కులం, ఆదాయం సర్టిఫికెట్లు, రేషన్‌కార్డు, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, విద్యార్హత సర్టిఫికెట్ ఆయా మండల కేంద్రాల్లో గల ఆదర్శపాఠశాలల్లో అందజేయాలి.

రిజర్వేషన్లు ఇలా..

15శాతం ఎస్సీలకు, 6శాతం ఎస్టీలకు, 29శాతం బీసీలకు (7శాతం బీసీ–ఎ, 10శాతం బీసీ–బి, బీసీ–సీలకు ఒకశాతం, బీసీ–డీలకు 7శాతం, బీసీ–ఈలకు 4శాతం) సీట్ల కేటాయింపులు ఉంటాయి. దివ్యాంగులకు 3శాతం, బాలికలకు 33.33శాతం సీట్లు కేటాయించారు. నిర్దేశించిన విభాగాల్లో అభ్యర్థులు లేకపోతే ఇతర గ్రూపుల నుంచి భర్తీచేస్తారు. 50శాతం సీట్లు ఇతర కులాలకు నిర్దేశించారు.

ప్రవేశ పరీక్ష ఇలా..

ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21వ తేదీన ఆయా ఆదర్శ పాఠశాలల్లో నిర్వహించనున్నారు. ప్రశ్నపత్రం ఆబ్జెక్టివ్ పద్ధతిలో తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమంలో ఉంటుంది.

పాఠశాలల ప్రత్యేకత

ఉన్నత విద్యార్హతలు, అంకితభావం కలిగిన ఉపాధ్యాయులతో బోధన, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ, ప్రవేశం పొందిన విద్యార్థులకు ఆరవ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుకునే అవకాశం, జిల్లా, రాష్ట్రస్థాయి ఆటలపోటీలకు ప్రత్యేక శిక్షణ, క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్య, విశాలమైన లైబ్రరీ సదుపాయం, పూర్తిస్థాయి పరికరాలు కలిగిన సౌకర్యవంతమైన ప్రయోగశాలలు ఉన్నాయి.

అధునాతన వసతి గృహాలు

ఈ పాఠశాలల్లో చేరిన విద్యార్థినులకు ప్రత్యేకించి అధునాతన వసతి గృహాలను పాఠశాలకు అనుసంధానంగా నిర్మించారు. విద్యార్థినులకు మోడరన్ మంచాలు, దుప్పట్లు, బెడ్‌షీట్‌లు అందిస్తున్నారు. ఒక్కో హాస్టల్‌లో వంద మంది విద్యార్థినులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. హాస్టల్‌లో కూడా హెచ్చు విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులతో ప్రత్యేక ట్యూటర్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.



అధునాతన హాస్టల్ భవనం

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించే దిశగా ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను నెలకొల్పింది. ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశం చక్కని అవకాశంగా విద్యార్థులు, తల్లిదండ్రులు భావిస్తున్నారు. నూతన భవనాలు, విశాలమైన తరగతి గదులు, ఎన్నో మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో ఈ పాఠశాలలకు ఆదరణ పెరిగింది.

– పి.శివప్రసాద్, ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్, కొత్తవలస మండలం

ఇద్దరికి తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణపాయ స్థితిలో ఉన్న శంకరరావు

వీరఘట్టం: మండలంలోని సీఎస్‌పీ రహదారిలో రేగులపాడు జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి 8.30 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వీరఘట్టానికి చెందిన డి.శంకరరావు, పి.శ్రీనివాసరావు స్కూటీపై పాలకొండ మండలం పొట్లి గ్రామం నుంచి వీరఘట్టం వస్తుండగా రేగులపాడు జంక్షన్ వద్ద వారి స్కూటీని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ప్రమాద సమాచారం తెలియడంతో 108 వాహనం ప్రమాదస్థలానికి వచ్చి క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యచికిత్స కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించింది.



తీవ్రంగా గాయపడిన శ్రీనువాసరావు

ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధం కావాలి

- డీఈఓ ప్రేమ్‌కుమార్

చీపురుపల్లి: పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ సూచించారు. ఈ మేరకు చీపురుపల్లి పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆదివారం ఆయన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. మరికొద్ది రోజుల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఎలా సిద్ధమవుతున్నారు, సిలబస్ ఎలా చదువుకుంటున్నారు, ఎలాంటి ప్రణాళికలు వేసుకున్నారని ప్రశ్నించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షలంటే భయాన్ని వీడాలని, ధైర్యంగా పరీక్షలు రాసేందుకు ముందుకు వెళ్లాలని ధైర్యం చెప్పారు. ఏడాది కాలంగా తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధించిన, విద్యార్థులు చదివిన అంశాలు మాత్రమే పరీక్షా ప్రశ్నపత్రాల్లో వస్తాయని చెప్పారు. ప్రస్తుతం ఉన్న కొంత సమయంలో ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తీర్ణత విద్యార్థుల సొంతమవుతుందన్నారు. విద్యార్థులు అంతా మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

జనాభా ప్రాతిపదికన విశ్వ బ్రాహ్మణులకు ఎమ్మెల్యే సీట్లు

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడి డిమాండ్

విజయనగరం: జనాభా ప్రాతిపదికన విశ్వబ్రాహ్మణులకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గం రాష్ట్ర అధ్యక్షుడు చెవ్వూరి రామస్వామి కోరారు. ఈ మేరకు ఆయన రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా ఆదివారం విజయనగరానికి విచ్చేసిన సందర్భంగా స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విశ్వబ్రాహ్మణులు రాజకీయంగా, సామాజికంగా చైతన్యవంతం కావాలని పిలుపునిచ్చారు. విశ్వబ్రాహ్మణులకు రానున్న ఎన్నికల్లో ప్రాతినిధ్యం కల్పించాలని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల మంది విశ్వబ్రాహ్మణ ఓటర్లు ఉన్నట్లు 2011 లెక్కలు తెలియజేస్తు న్నాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణకారులు, వడ్రంగి పనివారికి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. విశ్వబ్రాహ్మణులను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయని విమర్శించారు. తమ హక్కులు అడగడం కోసం, తమ డిమాండ్‌లను సాధించడం కోసం రాష్ట్రవ్యాప్తంగా తాను పర్యటిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, పొన్నపల్లి అప్పారావు, నాగభూషణం, కోసూరు రాంబాబు, మందవరపు వరదాచారి లక్కోజు శేఖర్ గోడి అరుణ, వేముల ప్రకాశం లతోపాటు విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెవ్వూరి రామస్వామి

మంత్రి కుమారుడి మానవత్వం

- రోడ్డుపై పడి ఉన్న క్షతగాత్రులకు ప్రథమ చికిత్స
- తన కారులో ఎక్కించుకుని ఆస్పత్రికి తరలింపు

చీపురుపల్లి: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కుమారుడు ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా.బొత్స సందీప్ తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఆయన ప్రయాణిస్తున్న మార్గంలో ప్రమాదం జరిగి రోడ్డుపై పడి ఉన్న క్షతగాత్రులను చూసి చలించిపోయారు. వెంటనే తన కారు ఆపి కిందికి దిగి క్షతగాత్రుల పరిస్థితి తెలుసుకుని, వారికి ప్రథమ చికిత్స అందజేసి, తన కారులో వారిని ఎక్కించుకుని చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి దగ్గరుండి వైద్యం అందించారు. ఆదివారం సాయంత్రం చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని ఆకులపేట సమీపంలో జరిగిన ఈ సంఘటన స్థానికంగా సోషల్ మీడియాలో సైతం వైరల్ అయ్యింది. డా.బొత్స సందీప్ గరివిడి మండలంలోని వెదుళ్లవలసలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొని తిరిగి విజయనగరం వెళ్తున్నారు. అదే సమయంలో ఆకులపేట వద్ద రోడ్డుపై అదే గ్రామానికి చెందిన పిల్ల రాము తన భార్య పాపతో కలిసి బైక్‌పై వెళ్తూ ప్రమాదం జరిగి రోడ్డుపై పడి ఉన్నారు. ఈ విషయాన్ని గమనించి డా.సందీప్ వెంటనే కారు దిగి, క్షతగాత్రుడు రాముకు తీవ్రంగా రక్తస్రావం అవుతుండడంతో ప్రథమ చికిత్స అందించారు. తరువాత తన కారులో వారిని చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లి దగ్గరుండి చేర్పించి, అక్కడి వైద్యులతో కలిసి వైద్యం అందజేశారు. బాధితుల కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు.



సంఘటనా స్థలంలో క్షతగాత్రుడు రాము కాలి గాయానికి టవల్‌తో అద్దిపెడుతున్న మంత్రి బొత్స కుమారుడు డా.సందీప్

రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

- మరో నలుగురికి గాయాలు



సీతంపేట: సంఘటనా స్థలంలో గాయాలపాలైన వ్యక్తులు

సీతంపేట: మండలంలోని కుశిమి జంక్షన్ వద్ద ఆదివారం రెండు బైక్‌లు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో రాజాం పట్టణానికి చెందిన మణికంఠ (30) మృతిచెందాడు. ఈ ప్రమాదంలో మరో నలుగురికి గాయాలయ్యాయి. ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. కొత్తూరుకు చెందిన చంద్రకాంత్, భార్య అనూషలు ఆమదాలవలసకు సొంతపనిమీద వెళ్లి బైక్‌పై వస్తున్నారు. అదే సమయంలో రాజాం పట్టణానికి చెందిన మణికంఠ, రాకేష్, తరుణ్‌కుమార్‌లు సీతంపేట అడ్వెంచర్ పార్కుకు వచ్చి తిరుగుప్రయాణంలో బైక్‌పై అతివేగంగా వస్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న చంద్రకాంత్ బైక్‌ను కుశిమి కూడలి వద్ద బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం జరిగి అంతా తీవ్ర గాయాల పాలయ్యారు. వెంటనే స్థానికుల చొరవతో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మర్గమధ్యంలో మణికంఠ మృతిచెందాడు. మిగతా నలుగురు చికిత్స పొందుతున్నారు.అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు.

మరో ప్రమాదంలో ట్యాక్సీ డ్రైవర్..



రామభద్రపురం: శ్రీనివాసరావు మృతదేహం

రామభద్రపురం: సాలూరుకు చెందిన తాడుతూరి శ్రీనివాసరావు(43) అతి వేగంగా ట్యాక్సీని నడపడంతో జరిగిన ప్రమాదంలో మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. ఈ ఘటనపై ఎస్సై వి.జ్ఞానప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ట్యాక్సీ డ్రైవర్ శ్రీనివాసరావు విజయనగరం బేరమాడుకుని నెలిపర్తికి చెందిన రవికుమార్‌ను వాహనవంలో ఎక్కించి స్పీడుగా వెళ్తుండగా రామభద్రపురం మండలం ఎరుకుల పాకల వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ట్యాక్సీ బోల్తా కొట్టి కాలువ అవతల ప్రాంతంలో పడిపోవడంతో ఛాతీకి, తలకు గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. లోపలున్న రవికుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. మృతుడి తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి సహాయ నిరాకరణ

- డిమాండ్లు పరిష్కరించక పోతే 11నుంచి నిరవధిక సమ్మె
- పీఏసీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు పి. కామేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కామేశ్వరరావు

విజయనగరం ఫూల్‌బాగ్: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పీఏసీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు పి.కామేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలపై ఆదివారం అమర్‌భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 94 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు చెందిన 300మంది ఉద్యోగులు గడిచిన 4 నెలలుగా వారి సమస్యలను పలు దఫాలుగా జిల్లా సహకార అధికారులకు తెలియజేసినా, ఉద్యమాలు చేసినా పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఫిబ్రవరి 26న జరిగిన జిల్లా సమావేశానంతరం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో, జిల్లా సహకార అధికారికి వినతిపత్రం అందజేశామని చెప్పారు. అన్ని సంఘాల్లో ఉద్యోగులకు పెండింగ్ జీతాలు చెల్లించాలి. డీసీసీబీ కాకుండా పీఏసీఎస్‌ల ద్వారా రుణాలను మంజూరు చేయాలి. డీసీసీబీల మాదిరిగానే పీఏసీఎస్‌లను కంప్యూటరీకరణ చేయాలి. 138.38 డీఏ తక్షణమే అమలు చేయాలి. 2019 మార్చి 1తరువాత చేరిన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలనే 12 డిమాండ్లను వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. అలాగే తమ డిమాండ్లపై స్పందించకపోతే మార్చి 4 నుంచి దశల వారీ ఆందోళన చేపడతామని, అటుపై మార్చి 11నుంచి నిరవధిక సమ్మె చేపడతామని కామేశ్వరరావు స్పష్టం చేశారు. సమావేశంలో పీఏసీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.సత్యారావు, ప్రధాన కార్యదర్శి బి.రామునాయుడు, కోశాధికారి ఏపీ సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు బి.నారాయణ రావు, వి.గిరిబాబు పాల్గొన్నారు.

జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

- 25 కుటుంబాల వారిని ఆహ్వానించిన డిప్యూటీ స్పీకర్

విజయనగరం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు, స్థానికంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులైన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నారు. ఈ మేరకు ఆదివారం విజయనగరంలోని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల నివాసంలో జరిగిన కార్యక్రమంలో 27వ డివిజన్ జొన్నగుడ్డి ప్రాంతంలోని జనసేన పార్టీకి చెందిన 25 కుటుంబాల వారు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ చేరిన వారందరికీ కోలగట్ల వీరభద్రస్వామి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు మాట్లాడుతూ గడిచిన 4 ఏళ్ల 10 నెలల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై జనసేన పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరడం శుభపరిణామన్నారు. స్థానికంగా శాసనసభ్యుడు కోలగట్ల వీరభద్రస్వామి నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటారన్నారు. ఏ కష్టం వచ్చినా ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారని గుర్తుచేశారు. ఓవైపు నగరాన్ని అభివృద్ధి చేస్తూ మరోవైపు ప్రజల సంక్షేమాన్ని, కష్టసుఖాలు పట్టించుకున్న నాయకుడు కోలగట్ల వీరభద్ర స్వామి అని స్పష్టం చేశారు.



జనసేన పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో కోలగట్ల తదితరులు

సంక్షేమం భేష్

27వ డివిజన్ కార్పొరేటర్ దుప్పాడ సునీత మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, స్థానికంగా శాసనసభ్యుడు కోలగట్ల వీరభద్ర స్వామి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై తమ డివిజన్ ప్రాంతానికి చెందిన 25 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరినట్లు పేర్కొన్నారు. రానున్న ఎన్నికలలో కోలగట్ల గెలుపే లక్ష్యంగా తామంతా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ సంగంరెడ్డి బంగారు నాయుడు, కార్పొరేటర్ అల్లు చాణక్య, వైఎస్సార్‌సీపీ నాయకులు దుప్పాడ పైడి, చందక నూకరాజు, తాలాడ జయరాం, ముక్కు కుమార్, గోకప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.